


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 103 శనివారం 12 సెప్టెంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

## ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర..

### మహిళా అధికారుల ముందు అభ్యంతరకరంగా వ్యవహరించారు



శాసనసభను సజావుగా సాగనివ్వకుండా బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆయన ఫాంహౌస్ లోనే కుట్రలు పన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజా ప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభా కార్య క్రమాలను అడ్డుకున్నారని మండిపడ్డారు. – మిగతా2లో

## సంక్షేమ క్యాలెండర్ సిద్ధం చేయండి..

### కలెక్టర్లకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- సంక్షేమ పథకాల పంపిణీకి తేదీలతో కూడిన క్యాలెండర్ రూపకల్పన చేయాలన్న సీఎం
- గత ప్రభుత్వ 'ఫ్యామిలీ మ్యాపింగ్ విధానం'పై చంద్రబాబు అసంతృప్తి
- వక్ఫ్ బోర్డు భూముల నుంచి ఆదాయం పెంచాలని అధికారులకు ఆదేశం
- కులవృత్తులకు విలువ జోడించేలా కార్యాచరణకు సూచన
- కాపు కార్పొరేషన్ నిధులు వెంటనే వినియోగించాలని స్పష్టీకరణ



2

## పుతిన్ భోజనం అంత ఈజీ కాదు..

### విదేశీ పర్యటనల్లో ఆయన ఫుడ్ సీక్రెట్ ఇదే



ఓ దేశాధినేత విదేశీ పర్యటనకు వెళ్తే ఆతిథ్య దేశం ప్రత్యేక విందులు సిద్ధం చేస్తుంది. కానీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విషయంలో మాత్రం వ్యవహారం కాస్త భిన్నమట. ఆయన తినే ఆహారం విషయంలో అత్యంత కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకుంటారని నివేదికలు చెబుతున్నాయి. హోటల్‌లో వండిన ఆహారం కంటే సొంత బృందం సిద్ధం చేసిన భోజనానికే ప్రాధాన్యం ఇస్తారట. – మిగతా2లో

## గల్వాన్ తర్వాత మారుతున్న సీన్..

### మోదీతో జిన్‌పింగ్ భేటీకి ముందు చైనా కీలక ప్రకటన

• విభేదాలను పరిష్కరించుకుంటామని స్పష్టీకరణ • 2019 తర్వాత భారత్‌కు జిన్‌పింగ్ తొలిసారి రాక • 2024లో గస్తీ ఒప్పందంతో కీలక పరిణామం • వరుసగా మూడో ఏడాది మోదీ–జిన్‌పింగ్ భేటీ • బ్రిక్స్ సహకారంపై జిన్‌పింగ్ కీలక ప్రసంగం



2

## సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. – మిగతా2లో



## స్థానిక సంస్థల ఎన్నికల పై షర్మిల కీలక నిర్ణయం..



2

- రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు
- స్థానిక సంస్థల ఎన్నికల పై దృష్టి సారించిన షర్మిల
- కమిటీలో రుద్రరాజు, పల్లంరాజు, కృపారాణి, తులసిరెడ్డి తదితర నేతలు
- గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రచించాలని దిశానిర్దేశం

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకోవడమే లక్ష్యంగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. స్థానిక పోరులో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేయడం

## పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం..

ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. – మిగతా2లో



## రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే



సీఎం రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, భూ దందాలు చేసే రేవంత్‌రెడ్డి – మిగతా2లో

# సంక్షేమ క్యాలెండర్ సిద్ధం చేయండి.. కలెక్టర్లకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

వెలగపూడి సచివాలయంలో జిల్లా కలెక్టర్ల సమావేశం రెండో రోజు కొనసాగింది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ విధానాలపై కీలక ఆదేశాలు జారీ అయ్యాయి. సంక్షేమ పథకాల పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేలా ఏయే పథకాన్ని ఏ తేదీన అందిస్తున్నామో స్పష్టంగా పేర్కొంటూ ఒక 'సంక్షేమ క్యాలెండర్' రూపొందించాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. అంతేగాక ప్రభుత్వం అందిస్తున్న నగదును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా వారిలో ఆర్థిక అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కులవృత్తులకు ఊతమిచ్చేలా, వాటికి విలువ జోడించే (వాల్యూ అడిషన్) కార్యాచరణ సిద్ధం చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. చేనేత, చేతివృత్తుల కేంద్రాలను కేవలం అమ్మకపు కేంద్రాలుగా కాకుండా, ప్రజలకు ఒక అనుభూతిని పంచే 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు'గా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. కాపు కార్పొరేషన్ రుణాల విషయంలో ఎక్కడైనా నిధులు అందుబాటులో ఉంటే తక్షణమే వాటిని వినియోగించాలని, నిధుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

**'ఫ్యామిలీ మ్యాపింగ్'పై ముఖ్యమంత్రి అసంతృప్తి**

గత ప్రభుత్వ హయాంలో అనుసరించిన 'ఫ్యామిలీ మ్యాపింగ్' విధానంపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల ఇష్టానుసారంగా పెన్షన్లు, ఇళ్లు కేటాయించారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. మన కాన్సెప్ట్ 'కంబైన్డ్ ఫ్యామిలీ' అని, పెద్ద కుటుంబాలకు అధిక ప్రయోజనాలు చేకూరేలా నూతన విధానాలు రూపొందించాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

**మైనార్టీల సంక్షేమం, వక్ఫ్ బోర్డు ఆస్తుల నిర్వహణపై సీఎం ప్రత్యేక దృష్టి**

మైనార్టీల సంక్షేమం, వక్ఫ్ బోర్డు ఆస్తుల నిర్వహణపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. వక్ఫ్ బోర్డుకు లెక్కలేనన్ని భూములు ఉన్నప్పటికీ, ఆదాయం మాత్రం నామమాత్రంగానే వస్తోందని అన్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఒక్కరోజే రూ.7 కోట్ల ఆదాయం వస్తుంటే, వేల ఎకరాల ఆస్తులున్న వక్ఫ్ బోర్డు ఆదాయం ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించారు. అధికారులు ఇప్పటికైనా చిత్తశుద్ధితో పనిచేసి, ఆస్తుల నుంచి ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించి మైనార్టీ కమ్యూనిటీకి న్యాయం చేయాలని ఆదేశించారు. "మైనార్టీలు బలహీనంగా ఉన్నారు, వారి కోసం పనిచేయాల్సిన మీరూ బలహీనంగానే ఉన్నారు. ఇకనైనా వారికోసం గట్టిగా పనిచేయండి" అని అధికారులకు స్పష్టం చేశారు.

# ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర.. మహిళా అధికారుల ముందు అభ్యంతరకరంగా వ్యవహరించారు

అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభాకార్యక్రమాలను అడ్డుకున్నారని మండిపడ్డారు. నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సభలో అధికారులపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, సభాపతిని అత్యంత తీవ్ర పదజాలంతో దూషించారని, మహిళా అధికారుల ముందే టీషర్టులు విప్పి అభ్యంతరకరంగా నిరసన తెలపడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిగజారుడుతనానికి నిదర్శనమని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి దళితులను ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుండి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలన్నింటిపై ప్రభుత్వం తరఫున సమగ్ర విచారణకు ఆదేశించామని వెల్లడించారు. బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాజకీయంగా ఎదిగిన సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి లాంటి నాయకులు ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేయాలని చూడటం దారుణమని సీఎం అన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోయి ఉంటే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కూడా కేటీఆర్‌కు తన రూపమే కనిపిస్తున్నట్టుందని, అందుకే అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు తెగబడుతున్నారని ఎద్దేవా చేశారు. పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా, చేపట్టిన సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎం వివరించారు. చారిత్రక భవనంలో శాసన మండలిని పునఃప్రారంభించుకోవడమే కాకుండా, అసెంబ్లీలోని సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, కేంద్రం చేపట్టబోయే జనాభా లెక్కల్లోనూ ఈ తెలంగాణ నమూనాను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో 'ఎస్ఐఆర్' పేరుతో లక్షలాది ఓట్లను తొలగించే పెద్ద కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే, ఓటర్ల జాబితాలో మాత్రం కేవలం 88 కోట్లే చూపిస్తున్నారని, అంటే దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని వివరించారు. ఎమ్మెల్యేగా మళ్లీ గెలవాలనుకునే ప్రతీ ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు పరిరక్షణను అత్యంత తీవ్రంగా పరిగణించాలని నిర్దేశించారు. శాసనసభ చర్చల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని, హాజరు శాతాన్ని కాపాడుకుంటూ స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

# పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం..

ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని లోకేశ్ సవాల్ విసిరినా జగన్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. త్వరలోనే లోకేశ్ నాయకత్వంలో మరో మూడు డీఎస్సీలను విజయవంతంగా నిర్వహించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహణకు ఉన్న ప్రాథమిక వ్యత్యాసం కూడా తెలీని వ్యక్తి జగన్ అని కేశినేని చిన్ని ఎద్దేవా చేశారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా పరీక్షలు ఉండవని, ఆ కేటాయింపులు నేరుగా సర్టిఫికెట్ల ఆధారంగా, మెరిట్ ప్రకారం జరుగుతాయని తెలిసినా వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న రామకృష్ణ అనే వ్యక్తికి డీఎస్సీలో ఉద్యోగం వస్తే, ఆయనకు రానట్లు సాక్షి పత్రికలో అబద్ధాలు రాశారని, ఆ బాధితుడు రామకృష్ణ స్వయంగా ఇక్కడే సజీవ సాక్ష్యంగా ఉన్నారని మీడియా ముందు ప్రదర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని జగన్, తొమ్మిది నెలలుగా కుంభకర్ణుడిలా నిద్రపోయి ఇప్పుడు గ్లోబల్ ప్రచారంతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసులో గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించడం, కోడికత్తి డ్రామాలు ఆడటం జగన్‌కు అలవాటేనని ఎంపీ ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ, గ్రూప్-1 నియామకాలలో జరిగిన భారీ అవకతవకలపై ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని తెలిపారు. ఆ అక్రమాల నివేదిక బయటకు వచ్చి తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే డీఎస్సీపై వైసీపీ నేతలు బురద జల్లుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం తప్పని నిరూపించే దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని జగన్‌కు సవాల్ విసిరారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో జగన్ కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని జోస్యం చెప్పారు.

# స్థానిక సంస్థల ఎన్నికల పై షర్మిల కీలక నిర్ణయం..

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకోవడమే లక్ష్యంగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. స్థానిక పోరులో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేయడం కోసం 8 మంది సీనియర్ నాయకులతో కూడిన 'రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ'ని ఆమె ఏర్పాటు చేశారు. ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మానిటరింగ్ కమిటీలో మాజీ కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులకు ప్రాధాన్యత కల్పించారు. కమిటీ కన్వీనర్‌గా మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సభ్యులుగా సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, రాజ్యసభ మాజీ సభ్యుడు, పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డిని నియమించారు. వీరితో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా నిర్వహణ, ఎన్నికల సమన్వయ ఇన్చార్జి బాధ్యతలను నెల్లూరు డీసీసీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డికి అప్పగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని మానిటరింగ్ కమిటీకి షర్మిల స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధివిధానాల ఖరారు, గెలుపు గుర్రాలైన అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాల బాధ్యతలను ఈ కమిటీయే చూస్తుందని ఆమె వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మానిటరింగ్ కమిటీతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆదేశించారు.

# సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మోదీ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పేర్కొన్నారు.

## పుతిన్ భోజనం అంత ఈజీ కాదు.. విదేశీ పర్యటనల్లో ఆయన ఫుడ్ సీక్రెట్ ఇదే

18వ బ్రిక్స్ సదస్సు కోసం పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ సదస్సు జరగనుంది. పుతిన్ ఐటీసీ మౌర్యలో బస చేయనున్నట్లు సమాచారం. విదేశీ పర్యటనల్లో పుతిన్ కోసం రష్యా నుంచి ప్రత్యేక వంట బృందం వెంట వస్తుందని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఆయనకు వడ్డించే ఆహార పదార్థాలను ముందుగానే క్షుణ్ణంగా పరీక్షిస్తారట. ప్రతి వంటకాన్ని పరిశీలించిన తర్వాతే ఆయనకు అందిస్తారని సమాచారం.

**హోటల్ వంటకాలకు దూరంగా?**

ఆతిథ్య దేశంలోని హోటళ్లు సిద్ధం చేసే ఆహారం సాధారణంగా పుతిన్ రోజువారీ భోజనంలో భాగం కాదని నివేదికలు చెబుతున్నాయి. ఆయన పర్యటనల కోసం ప్రత్యేక వంటగదులను ఏర్పాటు చేస్తారని సమాచారం. రష్యా నుంచి తీసుకొచ్చిన లేదా ముందుగా పూర్తిగా పరీక్షించిన పదార్థాలతోనే అక్కడ వంట చేస్తారట. ఆహారంలో ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా చూడటమే ఈ కఠిన నిబంధనల ప్రధాన ఉద్దేశమని తెలుస్తోంది. ప్రభుత్వ విందుల్లోనూ పుతిన్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఆహారాన్నే అందించే అవకాశముందని నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే దీని పై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికాలేదు.

**చేపలు, మాంసం..**

చేపలు పుతిన్ ఆహారంలో తరచూ ఉంటాయని చెబుతారు. తాజా లేదా ఎండు చేపలను ఇష్టపడతారట. గొర్రె మాంసం కూడా తీసుకుంటారని సమాచారం. అయితే ఎక్కువ మసాలాలు, కొవ్వుతో కూడిన వంటకాలకు దూరంగా ఉంటారట. టమాటాలు, దోసకాయల వంటి కూరగాయలతో చేసిన సలాడ్లు ఆయన ఆహారంలో ఉంటాయని నివేదికలు చెబుతున్నాయి. స్వీట్లు, క్రీమ్ పేస్ట్రీలు వంటి వాటిని సాధారణంగా తీసుకోరట. పానీయాల్లో తాజా జ్యూస్, కేఫీర్, హెర్బల్ డ్రింక్స్‌కు ప్రాధాన్యం ఇస్తారని సమాచారం. బీట్‌రూట్, హార్స్‌రాడిష్‌తో చేసిన సంప్రదాయ రష్యన్ పానీయాలు కూడా ఆయన మెనూలో ఉంటాయని చెబుతున్నారు.

## గల్వాన్ తర్వాత మారుతున్న సీన్.. మోదీతో జిన్‌పింగ్ భేటీకి ముందు చైనా కీలక ప్రకటన

ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందు బీజింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, చైనా మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా స్పష్టం చేసింది. ఇరు దేశాలు మంచి పొరుగుదేశాలుగా, స్నేహపూర్వకంగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. భారత్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ సమావేశం కానున్నారు. 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ తర్వాత సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2024 అక్టోబర్‌లో భారత్, చైనా సరిహద్దుల్లో గస్తీకి సంబంధించి కీలక ఒప్పందానికి వచ్చాయి. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ క్రమంగా మెరుగుపడుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. ఆ తర్వాత ఉన్నతస్థాయి సంప్రదింపులు మరింత పెరిగాయి. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. ఇరు దేశాల నేతల మార్గదర్శకత్వంలో వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో సంబంధాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పరస్పరం సంప్రదింపులు పెంచడం, సహకారాన్ని బలోపేతం చేయడం, విభేదాలను సరిగా నిర్వహించడం తమ లక్ష్యాలని తెలిపారు. మోదీ, జిన్‌పింగ్ వరుసగా మూడో ఏడాది సమావేశం కానున్నారు. గతంలో 2025 ఆగస్టులో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. విమాన సర్వీసులు, వీసాలు, ఉన్నతస్థాయి సంబంధాలు కూడా క్రమంగా పునరుద్ధరించుకుంటున్నాయి. బ్రిక్స్ సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని సభ్య దేశాలతో కలిసి పనిచేస్తామని చైనా తెలిపింది. అంతర్జాతీయ పరిస్థితులు, బ్రిక్స్ భవిష్యత్ అభివృద్ధి, పరస్పర సహకారంపై జిన్‌పింగ్ ఇతర దేశాల నేతలతో చర్చించనున్నారు. బ్రిక్స్‌ను 2009లో ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశాల వేదికగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సహా మరిన్ని దేశాలు ఉన్నాయి.

## రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భం గా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం కాకముందు రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్ మెయిల్ చేసి బతికేవారని, అలాంటి వ్యక్తి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక ముఠాను ఏర్పాటు చేసి, వారి కనుసన్నల్లో 22ఏ భూ దందా నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి స్కీం వెనుక ఒక స్కాం ఉందని, హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ పేర్లతో వేల ఎకరాల భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి భూదందాలకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో ఫాక్స్‌కాన్ వచ్చిన కొంగరకలాన్ భూములపై రేవంత్ కన్ను పడిందని, అక్కడ రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో వేలిముద్ర లేకుండా ఇంచు భూమి కూడా మార్చలేరని, కానీ ఇప్పుడు భూభారతితో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. భూములను కాపాడాల్సిన కాపలాదారులే కబ్జాదారులుగా మారారని అన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భూదోపిడీ జరుగుతోందని, ఈ వ్యవహారాలతో రేవంత్ రెడ్డి త్వరలోనే రాజీనామా చేయాల్సి వస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు. మరో రెండేళ్లలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శనివారం 12 సెప్టెంబర్ 2026

# సంపాదకీయం

## కాంట్రాక్ట్ అధ్యాపకుల శ్రమదోపిడీ ఆగేదెన్నడు?



ఒకవైపు ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యాసంస్థల నిర్మాణం.. నలందా-- తక్షశిలల నాటి ఘనత... ఏఐ యుగంలో సవాళ్లను ఎదుర్కొనే విద్యార్థుల తయారీ... అంటూ వెలువడే ప్రకటనల వెనక ఒక చేదు నిజం దాగి ఉంది. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో గత పాతికేళ్లుగా యూజీసీ నిర్దేశించిన అత్యున్నత విద్యార్హతలు (పీజీ, పీహెచ్‌డీ, నెట్/సెట్) కలిగి బోధిస్తున్న దాదాపు 1,200 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తీవ్ర ఆర్థిక, ఉద్యోగ భద్రతా సంక్షోభంలో ఉన్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్నా వీరి వేతనాలు 2019 నాటి స్థాయిలోనే నిలిచిపోయాయి.అదే తరగతి గదిలో, అదే సిలబస్‌ను బోధిస్తూ, అదే విశ్వవిద్యాలయ పరీక్షా బాధ్యతలు నిర్వహిస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకుల మధ్య వేతనాల్లో 167 శాతం వరకు వ్యత్యాసం ఉండటం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16లు కల్పించిన సమానత్వ హక్కుకే భంగం. షా సమీర్ భరత్‌భాయ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ గుజరాత్ (2025), స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ జగ్జిత్‌సింగ్ (2016) వంటి సుప్రీంకోర్టు తీర్పులు సమాన పనికి సమాన వేతనం అనే సూత్రాన్ని బలపరిచాయి. జీవోఎంఎస్ నెంబర్ 15 (2019) ద్వారా రెగ్యులర్ విశ్వవిద్యాలయ అధ్యాపకులకు ఏడో యూజీసీ పే స్కేల్ అమలైంది. దీంతో బేసిక్ పే రూ.21,600 నుంచి రూ.57,700కు, అంటే 167.6శాతం పెరిగింది. ఇందులో ఇంకా డీఏ, ఇతర అలవెన్సులు కలపలేదు. కాంట్రాక్ట్ అధ్యాపకుల బేసిక్ పే రూ.37,800 నుంచి రూ.57,700కు, అంటే కేవలం 52.6 శాతం మాత్రమే పెంచి ఫిట్‌మెంట్ బెనిఫిట్‌ను నిరాకరించారు. అలాగే జీవో ఆర్టీ నంబర్ 222 ప్రకారం డిగ్రీ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్లకు 12 నెలల జీతం ఇస్తూ, విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ అధ్యాపకులకు సంవత్సరానికి ఒక రోజు 'బ్రేక్' పేరుతో వేతనం కోత విధించడం వివక్షగా కనిపిస్తోంది. హర్యానా సెంట్రల్ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులకు రూ.57,700 బేసిక్ పేతో పాటు సుమారు రూ.16,156 డీఏ, అంటే నెలకు రూ.73,856కు పైగా గ్రాస్ శాలరీ లభిస్తోంది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ యూనివర్సిటీ 2021 నుంచే డీఏ, హెచ్‌ఆర్‌ఏలను చెల్లిస్తోంది. తెలంగాణలో మాత్రం డీఏ, హెచ్‌ఆర్‌ఏ, పీహెచ్‌డీ ఇన్సెంటివ్ వంటి ప్రయోజనాలు లేక ఇతర ప్రాంతాలతో పోలిస్తే సుమారు 25శాతం ఆదాయ వ్యత్యాసం ఉందని కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర ఉన్నత విద్యలో 74శాతం ఖాళీల సమస్య మరింత ఆందోళనకరం. మొత్తం 2,878 రెగ్యులర్ పోస్టుల్లో కేవలం 753 పోస్టులు మాత్రమే భర్తీ కాగా, 2,125 పోస్టులు అంటే 74శాతం ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేయకుండా కాంట్రాక్ట్ అధ్యాపకులతో చౌకగా పనిచేయించుకుంటూ దీర్ఘకాలంగా శ్రమ దోపిడీ చేస్తున్నారు. దీనివల్ల బోధన, పరిశోధన ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. దీర్ఘకాలంగా పనిచేస్తున్న 1,200 మంది అధ్యాపకులు ఉండగా వారికి న్యాయం చేయకుండా కొత్త నియామకాలకు వెళ్లడం కూడా ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఏడో యూజీసీ పే స్కేల్ రూ.57,700 నుంచి రూ.1,82,400 వరకు, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, పీహెచ్‌డీ ఇన్సెంటివ్, మెడికల్ అలవెన్స్ అమలు చేయాలి. ఎన్నో ఏళ్లగా సేవలందిస్తున్న 1,200 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను వారికి ఖాళీగా ఉన్న రెగ్యులర్ పోస్టుల్లో క్రమబద్ధీకరిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలి. గ్యాప్ శాలరీ విధానాన్ని రద్దు చేసి పన్నెండు నెలల పూర్తి వేతనం చెల్లించాలి. ఉన్నత విద్యకు నిధులు పెంచి, విశ్వవిద్యాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పిస్తూ పారదర్శక నియామకాలు చేపట్టాలి. కోటి ఆశలతో తెలంగాణ ఏర్పడి దశాబ్దం దాటింది. విద్యా వికాసం అంటే కేవలం భవనాలు నిర్మించడం కాదు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అధ్యాపకుడికి గౌరవప్రదమైన జీవితం, న్యాయమైన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడమే నిజమైన విద్యా వికాసం. 1,200 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులకు న్యాయం చేయడం తెలంగాణ ఉన్నత విద్య భవిష్యత్తును కాపాడటమే.

# ఎవరి కోసం ఈ బ్యాంకింగ్ సంస్కరణలు?




మన దేశ ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థలో పెనుమార్పులు జరగబోతున్న సంకేతాలు, ప్రకటనలు అనేకం చూస్తున్నాం. ప్రభుత్వ బ్యాంకుల సేవల మీద ఆధారపడ్డ విస్తృత ప్రజానీకం, మధ్య తరగతి మేధావివర్గం, ప్రజాస్వామ్యవాదులు, చిన్న--మధ్యతరహా పరిశ్రమల అధిపతులు మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకోవాలి, స్పందించాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉన్న పొదుపు ప్రజలది. బ్యాంకుల మూలధనం (కాపిటల్) ప్రజలు కట్టిన పన్నుల ఆదాయం నుంచి సమకూర్చినది. లక్షల కోట్ల రూపాయల లాభాలు ఉద్యోగుల శ్రమశక్తితో సంపాదించినవి. భారత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్న 'వికసిత్ భారత్--2047' సాధనలో బ్యాంకుల పాత్ర ఎలా ఉండాలో అధ్యయనం చేయడం కోసం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2026--27 బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. తదనుగుణంగా, ఆగస్టు 17, 18 తేదీల్లో ఆర్థికమంత్రిత్వ శాఖ నిర్వహించిన ప్రభుత్వరంగ బ్యాంకుల శిఖరాగ్ర సమావేశం ఆ ఉన్నతస్థాయి కమిటీకి నివేదించాల్సిన ప్రతిపాదనల మీద చర్చించింది. దీనికితోడు ప్రధానమంత్రి తన స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో ప్రపంచస్థాయి ఐదు పెద్ద బ్యాంకులలో కనీసం ఒక భారతీయ బ్యాంకు ఉండాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇవన్నీ బ్యాంకింగ్ రంగంలో పెనుమార్పులకు సంకేతం. అద్భుతమైన ఈ నినాదాల వెనుక దాగి ఉన్న నిజాలేమిటి?ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉన్న పొదుపు (డిపాజిట్లు)లో 60శాతం పైగా సొమ్ము సామాన్యులు, ఉద్యోగులు తమ భవిష్యత్తు కోసం, పిల్లల చదువులు, పెళ్లిళ్లకోసం దాచుకున్నదే. ఈ కష్టార్జితాన్ని సేవింగ్స్ ఖాతాలో పెట్టుకుంటే బ్యాంకులు చెల్లించే వడ్డీ 2.5 శాతం నుంచి 2.7శాతం. అదే ఫిక్స్‌డ్ డిపాజిట్ అయితే 6.5శాతం. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ సంవత్సరం ద్రవ్యోల్బణం 6శాతానికి చేరువలో ఉంది. అంటే ప్రతి ఏటా సామాన్యుడు దాచుకున్న పొదుపు విలువ తగ్గుతోంది తప్ప, రూపాయి విలువకు రక్షణ లేదు.బ్యాంకు రుణాల విషయంలో కూడా ప్రజలు ఆర్థికదోపిడీకి గురవుతున్నారు. సంస్కరణల పేరుతో బ్యాంక్ విధానాలలో వచ్చిన మార్పులే దీనికి కారణం. బ్యాంకులు మొత్తం ఇచ్చే రుణాలలో 40శాతం ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, చేతి వృత్తులు, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు ఇవ్వాలి. ఈ రుణాలు ఇవ్వని బ్యాంకుల మీద ఒకప్పుడు పెనాల్టీలు వేసేది రిజర్వ్ బ్యాంక్. కానీ బ్యాంకింగ్ సంస్కరణల అమలుతో మైక్రోఫైనాన్స్ కంపెనీలకు, నాన్--బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు (ఎన్‌బీఎఫ్‌సీ) ఇచ్చిన రుణాలనే ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చినట్టుగా పరిగణించడం మొదలయ్యింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు రైతులు, సామాన్యులకు ఇవ్వవలసిన రూ.14 లక్షల కోట్ల సొమ్మును ఎన్‌బీఎఫ్‌సీలకు ఇచ్చాయి. ఇదే సొమ్మును మైక్రోఫైనాన్స్ కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలు సామాన్య ప్రజలకు అప్పుగా ఇచ్చి, 20--30శాతం వడ్డీ వసూలు చేస్తూ వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తున్నాయి. ఆ రుణభారం, అప్పుల ఊబి నుంచి బయటపడలేక అనేక కుటుంబాలు బలవన్మరణానికి పాల్పడుతున్న వార్తలు నిత్యం చూస్తూనే ఉన్నాం. బ్యాంకులే నేరుగా అప్పులివ్వాచ్చుగా... మధ్యలో ఈ మధ్యవర్తులెందుకు? వైపరీత్యం ఏమిటంటే బ్యాంకులలో తన పొదుపు సొమ్ము దాచుకునే సామాన్యుడు ఒకవైపు దోపిడీకి గురవుతున్న రుణదాత. రెండోవైపు ఎన్‌బీఎఫ్‌సీల వద్ద అధిక వడ్డీ దోపిడీకి గురయ్యే రుణగ్రహీత. ఈ దోపిడీలను కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఎందుకు అనుమతిస్తున్నాయి? దీనికితోడు, గత ఐదేళ్ల కాలంలో ఖాతాలో మినిమం బ్యాలెన్స్ లేదనో, తగిన బ్యాలెన్స్ లేకుండా చెక్కులు ఇచ్చారనో, ఇంకా అనేక కారణాలతో పెనాల్టీల రూపంలో ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకులు ఖాతాదారుల నుంచి రూ.28,495 కోట్లు వసూలు చేశాయి.పార్లమెంటు చట్టాల ద్వారా ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థలు లేబర్ చట్టాలను అమలుచేస్తూ 'మోడల్ ఎంప్లాయర్'గా ఉండాలి, పర్మినెంట్ ఉద్యోగులను నియమించాలి. ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు సక్రమంగా అందించడానికి, పెరుగుతున్న వ్యాపారానికి తగినట్టుగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి. కానీ ప్రభుత్వరంగ బ్యాంకులలో పర్మినెంట్ ఉద్యోగుల కంటే ఎన్నోరెట్లు అధికంగా క్యాజువల్, టెంపరరీ, అప్రెంటిస్, కాంట్రాక్టు, ఫిక్స్‌డ్ టర్మ్, బిజినెస్ కరస్పాండెంట్లు తదితర అనేక రూపాలలో పర్మినెంట్ ఉద్యోగులు చెయ్యాల్సిన పనులే చేస్తున్నారు. వీరికి సరైన జీతాలు, ఇతరత్రా సౌకర్యాలు లేవు. బ్యాంకుల్లో కనీసం లక్షా నలభైవేల పర్మినెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొండి బాకీలను సమర్థవంతంగా వసూలు చెయ్యబోతున్నట్టు ప్రకటించింది. ఆ పేరుతో 'ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టీ చట్టం--2016' చేసింది. ప్రత్యేకంగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్స్, ఎన్‌సీఎల్‌టీలు సైతం ఏర్పాటు చేశానని చెప్పింది. కానీ, అప్పటివరకూ లేని విధంగా బ్యాంకులు పెద్ద ఎత్తున మొండి బాకీలు రద్దు చేసుకుంటున్నాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్, వీడియోకాన్ ఇండస్ట్రీస్, జీ నెట్వర్క్ లాంటి ఏడు కంపెనీలు అవి చెల్లించాల్సిన సొమ్ములో 97శాతం రద్దయి, 3శాతమే వసూలయ్యింది. ఈ ప్రభుత్వకాలంలో రూ.18 లక్షల కోట్లను మొండి బకాయిలుగా పరిగణించాయి. లక్షలాదిమంది బ్యాంకు ఉద్యోగుల శ్రమతో సంపాదించిన లాభాలు, ప్రజలపై పన్నుల ద్వారా సంపాదించిన పెట్టుబడి ఇలా బాకీల రూపంలో కార్పొరేట్ కంపెనీలకు చేరింది. ప్రభుత్వం చేసిన చట్టాలు బాకీలను వసూలు చెయ్యడం కాక, కార్పొరేట్ రుణాల రద్దును చట్టబద్ధం చేశాయి. ఇదే సొమ్ము సామాన్య ప్రజలకు, వ్యవసాయరంగానికి, ఎంఎస్ఎంఈలకు రుణాలుగా ఇచ్చి ఉంటే దేశ ఆర్థికవ్యవస్థ ఎంతో వృద్ధిచెందేది. ఎంప్లాయిమెంట్ పెరిగేది. కార్పొరేట్ శక్తులు, బ్యూరోక్రసీ, రాజకీయ శక్తుల అపవిత్ర కూటమి (నెక్సస్) వలనే ఇంత ప్రజాధనం దోపిడీకి వీలుకలిగిందనేది వాస్తవం కాదా? ఇది కాకులను కొట్టి గద్దలకు వెయ్యటం కాక మరేమిటి? ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలలో అనుభవం ఉన్నవారిని ప్రభుత్వ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, చైర్మన్లు తదితర ఉన్నతాధికారులుగా నియమించాలని, బ్యాంకుల మూలధనంలో విదేశీ పెట్టుబడిని 49శాతానికి పెంచాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. విదేశీ పెట్టుబడి లాభాల కోసమే వస్తుంది, లాభాలు లేకపోతే వాపసు వెళ్తుంది. అప్పుడు బ్యాంకులు ఆర్థిక ఒడుదుడుకులకు లోనవుతాయి, ప్రజల పొదుపు ప్రమాదంలో పడుతుంది. అందుకే, ఈ పరిస్థితులను అధ్యయనం చేసి వాస్తవాలను సామాన్య ప్రజానీకానికి, ప్రజాస్వామ్య శక్తులకు, రైతు, కార్మిక సంఘాలకు, దేశ యువతకు తెలియజేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక --యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్-- నిర్ణయించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రజల పొదుపుతో నడుస్తున్న ప్రజాసంస్థలు. ప్రజల పొదుపునకు ద్రవ్యోల్బణం నుంచి రక్షణనిచ్చేవిధంగా వడ్డీ రేట్లు పెంచాలని, దేశ ఆర్థికవ్యవస్థ సమ్మిళిత వృద్ధికి వెన్నెముకలైన వ్యవసాయ రంగానికి, గ్రామీణాభివృద్ధికి, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు, మౌలిక వసతుల రంగానికి ఎటువంటి మధ్యవర్తి సంస్థలు లేకుండా నేరుగా తక్కువ వడ్డీకి రుణాల నివ్వాలని సంఘాలు కోరుతున్నాయి. విధాన నిర్ణయాలు చేసే బ్యాంకు బోర్డులలో ఉద్యోగ సంఘాలకు, రైతు, కార్మిక, ఎంఎస్ఎంఈ రంగాల నిపుణులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. దీనివలన రుణాల మంజూరు, వసూలు లాంటి అంశాలమీద పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడు కోవటం ప్రజలందరి కర్తవ్యం. అది దేశ ఆర్థిక స్వావలంబనకు, సమ్మిళిత వృద్ధికి ఆధారంగా నిలుస్తుంది.

# అందరి మనోభావాలు దెబ్బతినకుండా చూడాలి- డీఎస్పీ





వెలుగోడు సెప్టెంబర్ 11వార్త సాక్ష్యం

వినాయక చవితి పండగ ను ప్రశాంతంగా, అందరి మనోభావాలు దెబ్బతినకుండా జరుపుకోవాలని ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్ తెలిపారు. వెలుగోడు పట్టణం లోని స్థానిక పోలీసుస్టేషన్ నందు శుక్రవారం శాంతి కమిటీ సమావేశం జరిగింది. డిఎస్పీ మాట్లాడుతూ గతం లో వినాయక చవితి పండగ ల సందర్భంగా జరిగిన కొన్ని సంఘటన ల దృష్ట్యా ఈ సారి నంద్యాల జిల్లా మొత్తం వెలుగోడు గ్రామం వైపు చూస్తుందని డీ ఎస్పీ అన్నారు.వెలుగోడు పట్టణం లో గత ఏడాది అన్ని శాఖల అధికారుల మధ్య, అన్ని మతాల పెద్దల మధ్య సమన్వయము లేక చిన్న పొరపాట్లు జరిగాయని, ఈ సారి ఎలాంటి అవాంఛనియ సంఘటన లు జరగకుండా చర్యలు ఉంటాయని అన్నారు. అందరికి పండగ లు ఉన్నాయని, హిందూవులకు ఎక్కువ పండుగ లు ఉన్నాయని, వినాయక చవితి పండుగ యువత ను రెచ్చగొట్టే పండుగ అని,ఒకరి పండుగ ఎక్కువ, మరొకరి పండుగ తక్కువ కాదని అందరి పండగ లు సమానమే అన్నారు. యువకులలో అతి ఉత్సాహం పనికి రాదని, మనం సంతోషంగా ఉండాలి, అలాగే అందరూ సంతోషంగా ఉండేలా చూడాలని చెప్పారు. ప్రతి ఒక్కరికి ఓర్పు చాలా ముఖ్యమని, శాంతి కమిటీ పెద్దలు వినాయక నిమజ్జనం సక్రమంగా జరిగేలా కొన్ని బాధ్యతలు తీసుకోవాలని , ఎక్కడే క్కడ ప్రాబ్లమ్ ఉందో, మూడు మతాల వారు ఉండి, సమస్యలు రాకుండా చూసుకోవాలని, షోషల్ మీడి యా వాస్తవాలు చూపాలని.పోలీసుల సూచన లను అర్థం చేసుకొని బాగా చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆత్మకూరు రూరల్ సి. ఐ సురేష్ కుమార్ రెడ్డి , ఎస్. ఐ సురేష్ గ్రామ కార్యదర్శి ఇర్ఫాన్, విద్యుత్ ఏ. ఇ రవీంద్ర నాయక్, ఇంచార్జి ఎంపిడిఓ గంధం మురారి,రెవిన్యూ ఇన్స్పెక్టర్ బూర్గన్న అన్ని మతాల పెద్దలు, గణేష్ మండపాల నిర్వాహ కులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో ఇంటింటి లెప్రసీ సర్వే



శ్రీశైలం సెప్టెంబర్11 వార్త సాక్ష్యం

శ్రీశైలం శ్రీగిరి కాలనీ సమీపంలో శుక్రవారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి కుష్ఠ వ్యాధి (లెప్రసీ) సర్వే నిర్వహించారు.ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించడంతో పాటు, కుష్ఠ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, చర్మం పొడిబారడం, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. సర్వేలో డాక్టర్ సాయి జాష్ణవి, సీహెచ్ఓ సుబ్బారాయుడు, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఆశ కార్యకర్త శిరీషతో పాటు వాలంటీర్ పాల్గొన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి లెప్రసీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించడంతో పాటు, అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేయించేలా చర్యలు చేపట్టారు.కుష్ఠ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం చేయవచ్చని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ప్రజలు వ్యాధి లక్షణాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు.

# మట్టి వినాయక విగ్రహాలు పంపిణి

వెలుగోడు సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం :

వినాయక చవితి పండుగసందర్భంగా మట్టి వినాయక విగ్రహాలు ఆదివారం పంపిణి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చేపట్టుటకు మట్టి వినాయకులను పూజించాలని , అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పొట్టి శ్రీరాములు సెంటర్ లో వాసవి సత్రం నందు ఆదివారం 9గంటలకు ఉచిత మట్టి వినాయకుల పంపిణి కార్యక్రమం లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించండి

**-ఆత్మకూరుసింగల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్**



ఆత్మకూరు సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం

శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో టిడిపి పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టే కార్యక్రమం'రెండేళ్ల సుపరిపాలన - అభివృద్ధి సంక్షేమం" ఇంటింటా ప్రచారం శుక్రవారం పట్టణంలోని టిడిపి క్లస్టర్ ఇంచార్జ్, సింగల్ విండో చైర్మన్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ మాట్లాడుతూ గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం, శ్రీశైలం నియోజ కవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చేపట్టిన శాశ్వత అభివృద్ధి పనుల ను, సంక్షేమం గురించి వివరిస్తూ త్వరలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. వీరి వెంట వార్డు అధ్యక్షులు సుబ్బరాజు, పర్వీన్, జిలాని బి, తదితరులు పాల్గొన్నారు.

# సైనికుల్లా పోరాడదాం- స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ సత్తా చాటుకుందాం








**-నంద్యాలమాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి**

నంద్యాల సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం

నంద్యాల చాబోలు రోడ్డులోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నంద్యాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే శిల్ప రవి కిషోర్ రెడ్డి ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమానికి వైసీపీ నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు అధికార కూటమి ప్రభుత్వ మోసాలపై ఉవ్వెత్తున ఎగసిపడ్డ ఆగ్రహజ్వాల! కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్సీపీ సీఈసీ సభ్యుడు పీపీ నాగిరెడ్డి, వైసీపీ డోన్ నియోజకవర్గ పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి హాజరయ్యారు.మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సమావేశంలో మాట్లా డుతూ. అధికారంలోకి వచ్చి కోటలు కడతామన్నారు. నేడు ప్రజలను కన్నీళ్లలో ముంచేశారు! ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఊకదంపుడు ఉపన్యా సాలు ఇచ్చిన చంద్రబాబు అండ్ కో, నేడు అధికా రంలోకి వచ్చాక ఆ పథకాలన్నింటినీ అటకెక్కించారు. రాష్ట్రంలో వర్షా లు కురక కరువు తాండవిస్తుంటే, కనీసం తాగు, సాగునీరు కూడా ఇవ్వలేని అసమర్థ స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. రైతన్నలు రోడ్డెక్కి పోరాటం చేస్తే తప్ప నీళ్లు విడుదల చేయని ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. అభివృద్ధిని గాలికొదిలేసి, కేవలం సంపద సృష్టించే పేరుతో ప్రజలను దోచుకోవడమే నేటి పాలకుల ఏకైక అజెండాగా మారిందని ఆరోపి ంచారు. డిఎస్సీలో స్పోర్ట్స్ కోటా నియామకాల మోసాలపై ప్రశ్నిస్తే నోరు మెదపని ఈ ప్రభుత్వానికి ప్రజలే త్వరలో తగిన బుద్ధి చెబుతారన్నారు.

**-కార్యకర్తలే పార్టీకి ఊపిరి... భయపడే ప్రసక్తే లేదు!**

శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు - కార్యకర్తలే పార్టీకి బలమని, కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం దక్కుతుందని భరోసా నిచ్చారు. పోలీసుల పేరుతో, అధికారుల పేరుతో వైసీపీ శ్రేణులను భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదు. ఓవరాక్షన్ చేస్తున్న ప్రతి ఒక్కరి పేర్లూ రాసి పెట్టుకోండి... భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

**-సైనికుల్లా కదిలిపోదాం- స్థానిక సంస్థల పీఠం కైవసం చేసుకుందాం!**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా, ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా రణరంగంలోకి దూకాలని, ఇంటింటికీ, ప్రతి గడప కు వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను, వైఫల్యా లను ఎండగట్టాలని ఆదేశించారు. నంద్యాల గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడించే వరకు నిద్రపో యేది లేదని. విజయం మనదే... సమర శంఖం పూరించండని వైసీపీ శ్రేణులకు పిలుపు నిచ్చారు! . వైసిపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సాయినాథ్ రెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి, కల్లూరి రామలింగారెడ్డి, పిపి మధుసూదన్ రెడ్డి శ్రీశైలం నియోజకవర్గం పరిశీల కుడు, నంద్యాల నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ శశికళ రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ సభ్యులు తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మి ల్ అమీర్ బాష, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పురు షోత్తం రెడ్డి విజయ శేఖర్ రెడ్డి, మహేశ్వర రెడ్డి, నంద్యాల, గోస్పాడు ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, వైసీపీ ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామ సుబ్బారెడ్డి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య,లీగల్ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి , అసెంబ్లీ గ్రీవియన్స్ అధ్యక్షుడు వివేకానంద రెడ్డి, జిల్లా వైసీపీ మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కారు రవికుమార్, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, వైసీపీ జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, జిల్లా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టి.వి రమణ, వైసీపీ రాష్ట్ర ర్ సెల్ జనరల్ సెక్రటరీ శంకర్ నాయక్, వైసిపి రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి ఆంజనేయులు, వైసీపీ మండల అధ్యక్షులు బసవేశ్వర రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు ప్రహల్లాద రెడ్డి, ఆర్.వి. సుబ్బారెడ్డి, నెరవాటి సత్యానారాయణ, వైసీపీ జిల్లా సెక్రటరీ దేవనగర్ బాషా, మాజీ కౌన్సిలర్ లు, సర్పంచ్ లు, ఎంపిటిసి లు, వార్డు ఇంచార్జ్ లు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీశైలం నియోజకవర్గలో వైఎస్ఆర్ సీపీవిస్తృత స్థాయి సమావేశం

**-ఆత్మకూరు వైసీపీ కార్యాలయంలో సభ్యత్వ కార్డులు పంపిణీ**

**-శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి**

ఆత్మకూరు సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం

శ్రీశైలం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో సమా వేశాన్ని నిర్వహించారు ముందుగా పార్టీ నాయకులకు కార్యకర్తలకు వైఎస్ఆర్సిపి పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్న కార్యకర్తలకు నాయ కులకు ఐడెంటి కార్డులు పంపిణీ చేశారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయ కులు, కార్యకర్తలు ఎలాంటి అధైర్యానికి గురికావాల్సిన అవసరం లేదని, "అధైర్యపడొద్దు.. మీకు అండగా నేనున్నాను" అని భరోసా కల్పించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియో జకవర్గంలోని ప్రతి గ్రామం,ప్రతి మండలంలో పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు,కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ విజయకేతనం ఎగురవేయాలని, నియోజకవర్గంలో మెజారిటీ స్థానాల ను కైవసం చేసుకుని పార్టీ సత్తా చాటాలని





అన్నారు.అందరూ సమన్వయంతో కష్టపడి పనిచేస్తే విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రస్తావిస్తూ, ఎన్నికల సమయంలో హామీల పేరుతో ప్రజలను మోసం చేశా రని శిల్పా చక్రపాణి రెడ్డి విమర్శించారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీని సంపూ ర్ణంగా అమలు చేశారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి మట్టం 870 అడుగుల స్థాయిలో ఉన్నప్పటికీ రాయ లసీమ ప్రాంతానికి సాగునీరు అందించలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని విమర్శించారు. నీటి లభ్యత ఉన్నప్ప టికీ రైతులకు సాగునీరు అందకపోవడం బాధాక రమన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు తాగునీటి కోసం కూడా పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని శిల్పా చక్రపాణి రెడ్డి విమర్శి ంచారు. ప్రజల సమస్యలపై వైఎస్ఆర్ సీపీ నిరంతరం పోరాటాలు చేస్తోందని, వైఎస్సా ర్సీపీ శ్రేణులు, ప్రజల పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం తాగునీటిని విడుదల చేసిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్ఆర్ సీపీ తరపున భవిష్యత్తులోనూ నిరంతర పోరాటాలు కొనసాగి స్తామని తెలిపారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తూ వైఎస్ఆర్ సీపీ నియోజ కవర్గంలో మరింత బలోపేతం చేయాలని సూచించారు.ఈ విస్తృత స్థాయి సమావేశంలో శ్రీశైలం నియోజకవర్గ నాయ కులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు ఎన్ఎస్ సయ్యద్ మీర్, మండల అధ్యక్షులు, రాజమోహన్ రెడ్డి వైఎస్ఆర్ సీపీ మైనార్టీ నాయకులు మోమిన్ అహ్మద్ హుస్సేన్, అంజాద్ అలీ, మునీర్ భాష కృష్ణాపురం మాజీ సర్పంచ్ లక్ష్మిరెడ్డి, ముష్టిపల్లె మాజీ సర్పంచ్ రవి నాయక్, మహిళలు దరగమ్మ, మాజీ వార్డు కౌన్సిలర్ పాణ్యం పార్వతి వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

వార్త సాక్ష్యం
VARTHAA SAKSHAMU
Editor : SAGINALA RAVI KUMAR
శనివారం 12 సెప్టెంబర్ 2026

## ఆరోగ్యం పోషకాలతోనే సాధ్యం సిడిపిఓ కోటేశ్వరి



ఆత్మకూరు సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం

తల్లి బిడ్డలు చక్కటి ఆరోగ్యంతో జీవించాలంటే పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఆత్మకూరు సిడిపిఓ కోటేశ్వరి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని అంగన్వాడి సెంటర్ 26లో గర్భవతులు, బాలింతలకు పోషకాహార విలువలపై సిడిపిఓ కోటేశ్వరి అవగాహన కల్పించారు. ఇంట్లో దొరికే మునగాకు బచ్చలాకు వంటి ఆకుకూరల్లో పుష్కలమైన పోషకాలు ఉంటాయని బాలింతలు గర్భవతులు సరైన మోతాదులో పోషకాహారాలు తీసుకుంటే తమ బిడ్డల ఆరోగ్యంతో పాటు తమ ఆరోగ్య పరిస్థితి వృద్ధాప్యం వరకు నిలకడగా ఉంటుందని తెలిపారు. ప్రధానంగా మునగాకులో లభించే కాల్షియం విటమిన్ ఈ విటమిన్ సి వంటి అత్యంత శక్తివంతమైన పోషకాలు తీసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని వివరించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వల ఆదేశాల మేరకు స్త్రీ, శిశు సంక్షేమ లక్ష్యంగా పనిచేస్తున్నామని సిడిపిఓ కోటేశ్వరి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ కోమలి, అంగన్వాడి టీచర్లు, చంద్రకళ, శోబితరాణి, కళావతి, కృష్ణకుమారి, లక్ష్మీదేవి, మూర్తి జాబి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు తమ నైపుణ్య అభివృద్ధి తో ముందుకు సగాలి

-ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బేబీ
-కూటమి ప్రభుత్వంలోనే మహిళలకు పెద్దపీట
-ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్ధిన్



ఆత్మకూరు సెప్టెంబర్ 11వార్త సాక్ష్యం

పట్టణంలోని రోజ్ అండ్ రెయిన్బో టైలరింగ్, కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో కోచింగ్ తీసుకొని ప్రతిభ కనబరిచిన మహిళలకు సర్టిఫికెట్ పంపిణీ, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్, బేబీ, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి వేణుగోపాల్ ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ షహబుద్దీన్ హాజర య్యారు ముందుగా రోజ్ అండ్ రెయిన్బో టైలరింగ్, కంప్యూటర్ ట్రైనింగ్ నిర్వాహకులు ముఖ్య అతిథులను మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికారు అనంతరం శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఏర్పాటుచేసిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మాట్లా డుతూ మహిళలు తమ నైపుణ్య అభివృద్ధి చెంది ప్రపంచంలో ముందుకు సాగాలన్నారు. అదేవిధంగా సింగిల్ విండో చైర్మన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య మరియు ఐటి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గ శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో మహిళలకు పెద్దపీట వేసి ఉపాధి అవకాశాలలో ప్రాధాన్యత ఇచ్చేది మహిళలకే అని, కొనియాడారు మహిళలు ఇంటి పనులకే పరిమితం కాకుండా స్రీ శక్తిగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ మేనేజర్ జిలాని బి, తెలుగుదేశం పార్టీ నాయకులు సుబ్బరాజు, మోహన చౌదరి, పర్వీన్, ఆశబి తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని అరెస్ట్ చేయాలి

భీమవరం సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం



అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పెనుగొండ మండలం మల్లపర్రు గ్రామానికి చెందిన గుడాల విశ్వనాథ్ ను వెంటనే అరెస్ట్ చేయాలని భీమవరం అంబేద్కర్ సెంటర్ లో దళిత సంఘాల అధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ ఆశయ సాధన కమిటి రాష్ట్ర అధ్యక్షులు కోనా జోసెప్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డా బిఆర్ అంబేద్కర్ విమర్శించే వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై విమర్శలు చేస్తే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గుడాల విశ్వనాథ్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దళిత ప్రజలను మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. ధర్నాలో జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్, జనరల్ సెక్రెటరీ బేతాళ కమలాకర్, గౌరవాధ్యక్షులు కేసి రాజు, బుంగ ఆదాము, పట్టేం సుభాకర్, గాతల సందీప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆధార్ రాజు, బోకూరి విజయరాజు, పి రాజబాబు, పి అమ్ములరావు, బందారు బాల సుందరం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం నీటి ముంపు నిరుద్యోగులకు 98 జీవో అమలు అయ్యేంత వరకు సంపూర్ణ మద్దతు










-నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి
-జీవో అమలు కోసం తమ జీవితాలు త్యాగం చేయడానికి శ్రీశైలం నిరుద్యోగులు సిద్ధం

నందికొట్కూరు సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం

శ్రీశైలం నీటి ముంపు నిరుద్యోగుల సంఘర్షణ సమితి .శ్రీశైలం నిరుద్యోగుల సంఘర్షణ సమితి చేపట్టిన 170 వ రోజు దీక్షా శిభిరాన్ని శుక్రవారం నందికొ ట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి సందర్శి ంచారు. కొత్తపల్లె, పాములపాడు, జూపాడుబంగ్లా, పగిడాల మండ లాల నుండి అత్యధిక సంఖ్యలోవ చ్చేసిన నిరుద్యోగులు దీక్షా శిభిరం నుండి అధ్యక్షుడు జయన్న గౌరవ అధ్యక్షుడు గుంపుల వెంకటేశ్వర్లు మరియు మహిళా అధ్యక్షరాలు సాలమ్మ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అగ్రభా గాన లబ్బి వెంకటస్వామి అర్ధనగ్న ప్రదర్శనలో పాల్గొని ముందుగా పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం డాక్టర్ బాబాసా హెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పటేల్ సెంటర్ వరకు అర్ధనగ్న ప్రదర్శన కొనసా గింది. పటేల్ విగ్రహానికి పూలమాల వేసి మానవాహారం నిర్వహించడం జరిగినది. అధ్యక్షుడు జయన్న గుంపుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సంధర్భంగా గౌరవ అధ్య క్షులు గుంపుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 11 7 గ్రామాలు నీటి ముంపుకు గురికాగా 107348 ఎకరాలు, నిర్వాసిత జనాభా 150000 వీదిపాలు అయ్యారని ఆయన అన్నారు. మద్రాసుకు తెలుగు గంగ ద్వారా 15 టీఎంసీ నీరు ఎస్ ఆర్ బి సి ఎడవ గట్టుకుడిగట్టు కాలువల కింద 10.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని 1900 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని సమాజానికి వెలుగు నిస్తున్న నిర్వాసితులు నిరుద్యోలుగా చీకట్లో జీవిస్తున్నారని అన్నారు జీవో 98 ప్రకారం ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలని ఆనాటి సీఎం ఎన్టీఆర్ 15-4-1986 తేదీన జీవో 98 నిజారీ చేశారని అయితే 40 ఏళ్ళు అయినప్పటికీ జీవో అమలుకు నోచుకోలేదని అందుకు నిదర్శనం 170 రోజులుగా జీవో అమలు కోసం 674 మంది ఉద్యోగాలివ్వాలని దీక్షలు చేపట్టినా పాలకులు స్పందించకపోవడం విచారకరమన్నారు. గతంలో 98 జీవో కోసం ఆందోళన చేపట్టడంతో ఆ కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దతునిచ్చి స్వయనా కర్నూలు SE కార్యాలయానికి తాళం వేసి నిరుద్యో గులతో పాటు దీక్షా శిభిరంలో



ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి వారం రోజుల పాటు దీక్షా శిభిరంలో కూర్చొవడంతో ప్రభుత్వ యం త్రాంగం స్పందించి కిరణ్ కుమార్ రెడ్డి నంది కొట్కూర్ పట్టణంలో మార్కెట్ యార్డులో 513 మంది కి ఎమ్మెల్యే లబ్బి అధ్యక్షతన నియామక పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. అంతకు ముందు మాజీ మంత్రి శేష శయనారెడ్డి అధ్య క్షతన నాటి ప్రధానమంత్రి పీవీ నరసిం హరావు, నాటి ముఖ్య మంత్రి కోట్ల విజయ భాస్కరెడ్డి 1 లోక్సభ స్పీకర్ మరియు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన సుమారు 20 కోట్లు లోక్ అదాలత్ ద్వారా చెక్కుల పంపిణి చేయడం జరిగిందన్నారు వెంటనే జీవో 98 అమలు చేసి శ్రీశైలం ముంపు భాదితులకు న్యాయం చెయ్యాలని గుంపుల వెంకటేశ్వర్లు కోరారు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి మాట ్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్ట్ కోసం యావదాస్థులను త్యాగం చేసిన త్యాగధనులకు గురించి నేటి పాలకులు పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. ప్రాజెక్ట్ వల్ల లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందుతున్న నంది కొట్కూర్ నియో జకవర్గ రైతుల పొలాలకు చుక్క నీరు అందడం లేదన్నారు. తాను ఎమ్మెల్యేగా వున్న ప్పుడు దీక్షాశిభిరాన్ని దర్శించానని ఎన్నో ఒత్తిడులు వచ్చినా తట్టుకొని నిలబడి పోరాడి 968 మందికి అప్రూవల్ చేయించి ఇంటికొక ఉద్యోగం ఇప్పించిన ఘనత మాకే దక్కిందన్నారు అదే విధంగా చెక్కులు అందజేసిన ఘనత బైరెడ్డి శేష శయనా రెడ్డికి దక్కిందన్నారు రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ వున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శభరి స్పందించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే భాద్యత ఎంతైనా వుందన్నారు ఈ నిరుద్యోగులు చేపట్టే కార్యక్ర మానికి సంపూర్ణ మద్దతు వుంటుందని ఉద్యోగాలు సాధించేంత వరకు వారి వెన్నంటే వుంటానని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం అదిరే బెదిరే ప్రసక్తే లేదని ఈ లబ్బి వెంకటస్వామి ఎవ్వరికి తల వంచన నని హర్షాద్వానాల మధ్య ప్రకటించారు. 98 జీవో ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని ఎన్నికల్లో ఇచ్చిన హామిని అమలు చెయ్యాలని వీధులు పిక్కటిల్లేటట్లు నినాదాలు చేశారు అనంతరం ర్యాలిగా వెళ్ళి తహ శిల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహి ంచి తహశిల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పి ంచారు. జిల్లా కలెక్టర్ దృష్టికి మీ సమస్యను తీసు కెళ్తానని తహశిల్దార్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా నాయకులు రఘురా మమూర్తి .ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్, ఐ యఫ్ టి యు జిల్లా కార్యదర్శి లాజరస్ కేవీపీస్ నాయకులు కర్ణ గంధం ఉశేనమ్మ . జయ ' పిడిఎసు నాయకులు పోల్ నవీన్, నందికొట్కూరు నియోజకవర్గం లో వివిధ మండలాల నుండి శ్రీశైలం ముంపు భాదితులు పెద్ద ఎత్తున తరలి వచ్చినారు. ముఖ్యంగా మహిళలతోపాటు చిన్నారులు పాల్గొనడం విశేషం

# పోతిరెడ్డిపాడుపై ప్రభుత్వ నిర్లక్ష్యం బట్టబయలు





-పోలీసులు అడ్డుకున్నా వెనక్కి తగ్గని వైసీపీ నేతలు

నంద్యాల సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం

రాయలసీమ జీవనాడి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్పై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తోంది. నిన్న 9వ గేటు రోప్ తెగిపోగా, తాజాగా 3వ గేటు ప్లంబర్ బ్లాక్ కట్ కావడం ఆందోళన కలిగిస్తోంది. వరుస ఘటనలతో రెగ్యులేటర్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపి స్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులను పరిశీలించేందుకు వెళ్తున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి నందికొ ట్కూరు ఇంచార్జ్ దారా సుధీర్ను పోలీసులు అడ్డుకు న్నారు. అయినా వెనక్కి తగ్గకుండా పోతిరె డ్డిపాడు హెడ్ రెగ్యులే టర్ను పరిశీలించిన వైసీపీ నేతలు, అక్కడి పరిస్థి తులను స్వయంగా పరిశీలి ంచారు. వరద సమ యంలో రాయలసీమకు అత్యంత కీలక మైన రెగ్యులేటర్పై నిర్లక్ష్యంగా వ్యవహరించడం



సరికాదని, తక్షణమే మరమ్మతులు చేపట్టి రెగ్యులేటర్ నిర్వహణను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు.

# తల్లిదండ్రులు తమపిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**-సీఐ నాగేశ్వర్ నాయక్**

దేవరపల్లి సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం

దేవరపల్లి మండలం, యర్నగూడెం గ్రామంలో మహిళల భద్రత, గంజాయి, సైబర్ నేరాలు, చోరీల నివారణపై మరియు రాబోవు వినాయక చవితి, పంచాయతీ ఎలక్షన్స్ పై అవగాహన కార్యక్రమం దేవరపల్లి: యర్నగూడెం గ్రామంలో దేవరపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు మహిళల భద్రత, గంజాయి నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, చోరీల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి సిఐ నాగేశ్వర నాయక్, ఎస్ఐ మనోహర్ గ్రామ ప్రజలకు పలు ముఖ్యమైన అంశాలపై దిశానిర్దేశం చేశారు. మహిళలు మరియు బాలికల భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ, బాలికలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీనేజ్ వయస్సులో ఏర్పడే ప్రేమ వ్యవహారాల విషయంలో బాలబాలికలపై తల్లిదండ్రులు స్నేహపూ ర్వకంగా దృష్టి పెట్టాలని, సోషల్ మీడియా పరిచయాల విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, యువతపై దాని ప్రభావం గురించి ప్రజలకు వివరించారు. గంజాయి వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులను అవసరమైన సందర్భాల్లో గంజాయి టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షించి, పాజిటివ్‌గా తేలిన వారికి తగిన కౌన్సిలింగ్ అందించి, అవసరమైతే డీ-అడిక్షన్ సెంటర్లకు పంపించి, గంజాయి వ్యసనం నుంచి బయటపడేలా సహకరిస్తామని తెలిపారు. గంజాయి విక్రయాలు, వినియోగంపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. రాత్రి వేళల్లో జరిగే దొంగతనాలు






మరియు ఇతర నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల సంచారం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామంలోని ముఖ్యమైన ప్రదేశాలు, కూడళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించడంలో పోలీసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటిపిలు, బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. రాబోయే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని, ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, వివాదాలు, ప్రలోభాలు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రాబోయే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపులు, లౌడ్‌స్పీకర్ల వినియోగం, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత తదితర అంశాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసుల సూచనలు మరియు అనుమ తులను పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో నిర్వహించే అనార్గనైజ్డ్ చిట్ ఫండ్‌లు, అనధికారిక చిట్ వ్యవహారాల వల్ల కలిగే ఆర్థిక నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సరైన అనుమతులు, చట్టబద్ధత లేని ఆర్థిక పథకాల్లో డబ్బులు పెట్టి మోసపోవద్దని హెచ్చరించారు. గ్రామ ప్రజలు పోలీసులతో సమన్వయంతో పనిచేస్తూ, నేరాల నివారణలో తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ఏ సమస్య ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రాలయంలో ప్రజా రాస్తాలను అడ్డుకుంటున్న కాంపౌండ్ వాల్స్‌పై సమగ్ర సర్వే చేయాలి -- బీఎస్ఎస్

**-ప్రభుత్వ భూములు, రాస్తాలు, ఎఫ్ఎంబీ, ఆర్ఎస్ఆర్ రికార్డుల్లో మార్పులపై ఆర్టీఐ ద్వారా పూర్తి ఆధారాలు సేకరిస్తాం**

**-ఆధారాలు లభిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు -- అవసరమైతే న్యాయపోరాటం చేస్తాం**

మంత్రాలయం సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం

మంత్రాలయం, కర్నూలు జిల్లా: మంత్రాలయం పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్స్ కారణంగా ప్రజలు, రైతులు రాకపోకలకు, వ్యవసాయ భూములకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమరేష్ తెలిపారు. బహుజన సమైక్య సమితి మంత్రాలయం మండల కన్వీనర్ సుంకేశ్వరి ఏసన్న ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాఘవేంద్ర నగర్ నుంచి ఆంజనేయ స్వామి విగ్రహం వరకు సుమారు ఒక కిలోమీటర్ మేర హైవే రోడ్డుకు ఇరువైపులా కాంపౌండ్ వాల్స్ నిర్మించారని, ఆలయానికి ఎదురుగా ఏటి వైపు వెళ్లే



రాస్తాపై కూడా కాంపౌండ్ వాల్ నిర్మాణం జరిగినట్లు స్థానికులు తెలిపారని అన్నారు. ఈ నిర్మాణాల వల్ల ప్రజలు, రైతులు ఎన్నో సంవత్సరాలుగా ఉపయోగిస్తున్న సంప్రదాయ రాస్తాలు, రాకపోకల మార్గాలకు ఆటంకం ఏర్పడిందా అనే అంశంపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఈజ్‌మెంట్ హక్కులు, రాస్తాలపై పూర్తి ఆధారాలు సేకరిస్తాం రైతుల రాకపోకల హక్కులు, మార్గ వినియోగ హక్కులకు సంబంధించిన అంశాలను చట్టపరంగా పరిశీలిస్తామని తెలిపారు. సర్వే నంబర్లు, క్షేత్ర కొలతల పుస్తకాలు, గ్రామ పటాలు, ఆర్ఎస్ఆర్, అడంగల్, 1-బి/ఆర్ఓఆర్, రోడ్డు మార్జిన్, రాస్తా/బండిబాట తదితర రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తామని చెప్పారు. మొదట ఆర్టీఐ ద్వారా ఆధారాలు -- తర్వాత కలెక్టర్‌కు ఫిర్యాదు ప్రభుత్వ భూములు,

## పిఎస్ఎం పాఠశాలలోని విద్యార్థులకు స్టీల్ కంచాలు పంపిణీ



భీమవరం సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం

రాజ్యసభ మాజీ సభ్యురాలు భీమవరం నియోజకవర్గం ఇంచార్జ్ తోట సీతారామలక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ పట్టణ తెలుగు యువత అధ్యక్షులు గోలగాని రమేష్ సహకారంతో శుక్రవారం భీమవరం పిఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ కంచాలను పంపిణి చేశారు. రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, వివిధ కార్పరేషన్ డైరెక్టర్లు చెరుకుపల్లి సంతోష్, ఉప్పులూరి చంద్రశేఖర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్ మాట్లాడుతూ సీతారామలక్ష్మి అంకుతటిత దీక్షతో పని చేస్తారని, వారి సేవలను గుర్తించి టిడిపి అధినేత చంద్రబాబు రాజ్యసభ సభ్యురాలుగా, ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్చార్జిగా పోలిట్ బ్యూరో సభ్యురాలుగా అనేక పదవి బాధ్యతలు అప్పగించి వారికి తగిన గుర్తింపును ఇచ్చారని, భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత పదవులకు చేరుకోవా లన్నారు. తెలుగు యువత పట్టణ అధ్యక్షులు గోలగాని రమేష్ మాట్లాడుతూ సీతారామలక్ష్మి నిండు నూరేళ్లు అష్టైశ్వర్య ఆరోగ్యాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకుంటూ వారి పుట్టినరోజును పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ కంచాలను పంపిణి చేశామన్నారు. కార్యక్రమంలో మెరగని నారాయణమ్మ, యలమంచిలి శ్రీనివాస్, ఇందుకూరి రామలింగరాజు, మాదాసు కనకదుర్గ, గొంతిన రమణ, గంధం రాధా, కొంద్రు శ్రీనివాస్, యాదవ్, గూదూరి సుబ్బారావు, మల్లువలస రాము, చెల్లబోయిన సుబ్బారావు, చెల్లబోయిన జయరాజు, పడమటి సోమేశ్వరరావు, విజ్జురోతి రాఘవులు, విజ్జురోతి గురు మూర్తి, గున్నేశ్వర్రావు, మాత సురేష్, నల్లం గంగాధర్, ఏం గంగాధర్ తిలక్, జోగేశ్వరి, శ్రీలక్ష్మి, హైమ, ఎండి షాబు, బొమ్మిడి వెంకటేశ్వరరావు, మరపట్ల శ్యామ్, కాగిత వెంకన్న, పురిగాళ్ల ఫణి, తిరుమాని మోహన్ రావు, హెచ్ ఎం సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ ఎడ్యుకేషన్‌లో తూర్పు గంగవరం జెడ్పీ హైస్కూల్ ప్రభంజనం

**-ఒకేషనల్ విద్యలో 100 శాతం ఉత్తీర్ణత..**

**ఆరుగురు విద్యార్థులకు 100/100 మార్కులు**

దర్శి సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం

విద్యార్థుల్లో విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా అమలు చేస్తున్న స్కిల్ ఎడ్యుకేషన్‌లో తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మార్చి నెలలో నిర్వహించిన ఒకేషనల్ విద్య పరీక్షల ఫలితాలు, మార్కుల మెమోలు శుక్రవారం విడుదల కాగా పాఠశాలకు చెందిన మొత్తం 43 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 43 మందీ ఉత్తీర్ణులయ్యారు. దీంతో పాఠశాల 100 శాతం ఉత్తీర్ణతను సాధించింది. స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలపైనే కాకుండా భవిష్యత్తులో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలకు ఉపయోగపడే వృత్తి నైపుణ్యాలు, ప్రాక్టికల్ నాలెడ్జ్, పని పట్ల అవగాహన, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై శిక్షణ అందుతుంది. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే వివిధ రంగాలకు సంబంధించిన ప్రాథమిక నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలకు కూడా సిద్ధమవుతున్నారు. తూర్పు గంగవరం పాఠశాలలో నిర్వహిస్తున్న ఒకేషనల్ విద్యలో బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన విభాగంలో నలుగురు విద్యార్థులు 100/100 మార్కులు, హెల్త్ కేర్ విభాగంలో ఇద్దరు విద్యార్థులు 100/100 మార్కులు సాధించడం విశేషం. మొత్తంగా ఆరుగురు విద్యార్థులు పూర్తి మార్కులు సాధించడం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.ఎస్.ఆర్.కె. ప్రసాద్ విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినం దించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన ఈ ఫలితాలు పాఠశాలకు గర్వకారణమని, ఒకేషనల్ విద్య ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తూ భవిష్యత్తులో మంచి అవకాశాలను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతున్నా



మని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుధాకర్, సీనియర్ ఉపాధ్యా యులు పవన్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఒకేషనల్ ట్రైనర్లు వై. అంజిబాబు, సిహెచ్. దావీదులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. 100 శాతం ఉత్తీర్ణతతో పాటు ఆరుగురు విద్యార్థులు 100/100 మార్కులు సాధించడం తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకేషనల్ విద్యా బోధనలో సాధించిన ఘన విజయంగా నిలిచింది.

## పోషణ పై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే అంగన్వాడి యొక్క ధ్యేయం

**-ఐసిడిఎస్ సూపర్వైజర్ బి అన్నపూర్ణ**

అమలాపురం సెప్టెంబర్ 11 వార్త సాక్ష్యం

మామిడికుదురు మండలం మామిడికుదురు గ్రామంలో. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో. పోషణ మాసం సందర్భంగా అంగన్వాడి అందించే పోషణ సేవలు సమతుల్య ఆహారం ఆరోగ్య పరిశుభ్రత ర అంశాలపై. శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సూపర్వైజర్ బి అన్నపూర్ణ మాట్లాడుతూ పోషణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిల్లలు గర్భిణీలు, బాలింతలు మహిళలకు మెరుగైన పోషకాహారం అందించడంతోపాటు పోషణ పై ప్రజల్లో అవగాహన పెంపొందించటమే అంగ న్వాడి యొక్క ధ్యేయం అని అన్నారు. ఈ కార్యక్ర మంలో అంగన్వాడీ కార్యకర్తలు. ఆయాలు. పిల్లలు తల్లిదండ్రులు .వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.



VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# బిజినెస్

## ఒక ఐఫోన్ కొనే బదులు 5 దేశాలు చుట్టేయొచ్చు
## విస్మయపరుస్తున్న యాపిల్ కొత్త ఫోన్ ధర!

మీ చేతిలో మూడు లక్షల రూపాయలు ఉంటే ఏం చేస్తారు? బహుశా ఓ మంచి కారు డౌన్ పేమెంట్ కట్టొచ్చు, లేదా కుటుంబంతో కలిసి దుబాయ్, థాయ్‌లాండ్, సింగపూర్ వంటి దేశాలు హాయిగా చుట్టి రావచ్చు. కానీ, టెక్ దిగ్గజం యాపిల్ మాత్రం ఈ మొత్తానికి కేవలం ఒక స్మార్ట్‌ఫోన్‌ను అందిస్తానంటోంది. అదే యాపిల్ నుంచి తాజాగా విడుదలైన తొలి ఫోల్డబుల్ ఫోన్ 'ఐఫోన్ డ్యుయో'. సెప్టెంబర్ 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ ఫోన్, తన ఫీచర్లతో పాటు ముఖ్యంగా ధరతో టెక్ ప్రపంచంలో పెను సంచలనం సృష్టిస్తోంది. భారత్‌లో ఈ ఫోన్ ప్రారంభ ధర (256జీబీ వేరియంట్) ఏకంగా రూ. 2,99,900గా నిర్ణయించారు. దీంతో నెటిజన్లు, టెక్ విశ్లేషకులు వెంటనే దాన్ని విదేశీ యాత్రల ప్యాకేజీలతో పోల్చడం మొదలుపెట్టారు. ఫ్లైట్ టికెట్లు, వీసా, హోటల్ వసతి, ఆహారం, ఇతర ఖర్చులన్నీ కలుపుకొని దుబాయ్, థాయ్‌లాండ్, బాలి, మారిషస్ వంటి దేశాలకు 6-7 రోజుల యాత్రకు సుమారు 60,000 నుంచి 1.5 లక్షల వరకు ఖర్చవుతుంది. అంటే, ఒక ఐఫోన్ డ్యుయో బేస్ మోడల్ ధరతో కనీసం రెండు అంతర్జాతీయ ట్రిప్పులకు వెళ్లిరావొచ్చు. అదే టాప్-ఎండ్ 2టీబీ మోడల్ ధర రూ. 4,49,900తో పోలిస్తే, దాదాపు ఐదు దేశాలు చుట్టిరావచ్చని అంచనా వేస్తున్నారు. ప్రేగ్, ఏథెన్స్ వంటి కొన్ని యూరోపియన్ ట్రిప్పులు కూడా ఈ ఫోన్ ధర కన్నా తక్కువకే సాధ్యమవుతాయని నివేదికలు పేర్కొంటున్నాయి.



## రికార్డు స్థాయికి భారత్ విదేశీ మారక నిల్వలు
## ఒక్క వారంలోనే 45 బిలియన్ డాలర్ల జంప్



భారత్ విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయికి చేరాయి. సెప్టెంబర్ 4తో ముగిసిన వారంలో ఏకంగా 44.90 బిలియన్ డాలర్లు పెరిగి 785.71 బిలియన్ డాలర్లకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం వెల్లడించింది. అంతకుముందు ఆగస్టు 28తో ముగిసిన వారంలోనూ విదేశీ మారక నిల్వలు 11.47 బిలియన్ డాలర్లు పెరిగి 740.80 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వరుసగా రెండో వారంలోనూ భారీగా నిల్వలు పెరిగాయి. మొత్తం నిల్వల్లో కీలకమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్‌సీఏ) భారీగా పెరిగాయి. వారంలో 47.498 బిలియన్ డాలర్లు పెరిగి 648.17 బిలియన్ డాలర్లకు చేరాయి. మార్చి చివరితో పోలిస్తే ఎఫ్‌సీఏ నిల్వలు 95.886 బిలియన్ డాలర్లు పెరిగాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 63.692 బిలియన్ డాలర్ల మేర అధికంగా ఉన్నాయి. అయితే బంగారం నిల్వలు మాత్రం 2.594 బిలియన్ డాలర్లు తగ్గి 113.816 బిలియన్ డాలర్లకు చేరాయి. అయినప్పటికీ ఏడాది క్రితంతో పోలిస్తే బంగారం నిల్వలు 23.517 బిలియన్ డాలర్లు ఎక్కువగా ఉన్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత్ స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) 4 మిలియన్ డాలర్లు తగ్గి 18.806 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐఎంఎఫ్‌లో భారత్ రిజర్వ్ పొజిషన్ మాత్రం 2 మిలియన్ డాలర్లు పెరిగి 4.916 బిలియన్ డాలర్లకు చేరింది. మార్చి చివరి నుంచి చూస్తే దేశ విదేశీ మారక నిల్వలు ఏకంగా 94.599 బిలియన్ డాలర్లు పెరిగాయి. ఏడాది క్రితంతో పోలిస్తే 87.438 బిలియన్ డాలర్ల మేర పెరిగాయి.

## ఐఆర్‌సీటీసీ ఆల్ టైమ్ రికార్డ్- ఒక్కరోజే 20 లక్షలకు పైగా టికెట్ల బుకింగ్!

పండుగల సీజన్ సమీపిస్తుండటంతో రైలు టికెట్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తన చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ నెల 7వ తేదీన ఒక్కరోజే 20 లక్షలకు పైగా టికెట్లను బుక్ చేసి ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పింది. ఐఆర్‌సీటీసీ చరిత్రలో రోజువారీ బుకింగ్‌ల సంఖ్య 20 లక్షల మార్కును దాటడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఐఆర్‌సీటీసీ వెల్లడించిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 7న ఒకేరోజులో మొత్తం 20,06,353 టికెట్లు బుక్ అయ్యాయి. ఆ మరుసటి రోజు, సెప్టెంబర్ 8న కూడా రద్దీ కొనసాగి, 19,50,699 టికెట్లు బుక్ అయ్యాయి. గతేడాది పండుగ సీజన్‌లో నమోదైన అత్యధిక సింగిల్-డే బుకింగ్ (18,40,203) కంటే ఇది 6 శాతం అధికం. ప్రస్తుతం రైల్వే రిజర్వ్‌డ్ టికెట్లలో దాదాపు 89 శాతం ఆన్‌లైన్‌లోనే బుక్ అవుతున్నాయని, ఈ భారీ ట్రాఫిక్‌ను తట్టుకునేలా సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేశామని ఐఆర్‌సీటీసీ తెలిపింది. భారీగా పెరిగిన ఈ ట్రాఫిక్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ఐఆం సీటీసీ ఇటీవల కీలక మార్పులు చేసింది. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వ్యవస్థ సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేస్తూ కొత్త సర్వర్లను ఏర్పాటు చేసింది. అంతేగాక 2026 జులై 15న సరికొత్త వెబ్‌సైట్, యూజర్ ఇంటర్‌ఫేస్‌ను ప్రారంభించింది. ఈ కొత్త వెబ్‌సైట్‌లో ప్రయాణికులు వివిధ తరగతుల్లో సీట్ల లభ్యతను ఒకే స్క్రీన్‌పై చూసుకునే వెసులుబాటు కల్పించారు. సాంకేతిక అప్‌గ్రేడ్‌లతో పాటు మోసపూరిత బుకింగ్‌లు, బాట్‌ల వాడకంపై ఐఆర్‌సీటీసీ ఉక్కు పాదం మోపింది. ఇందుకోసం ప్రవేశపెట్టిన యాంటీ-బాట్ సిస్టమ్ ద్వారా అనుమానాస్పద బాట్ ట్రాఫిక్‌ను 55-65 శాతం తగ్గించగలిగినట్లు సంస్థ వెల్లడించింది. అలాగే, బుకింగ్ విండో తెరుచుకున్న మొదటి 10 నిమిషాల పాటు (ఉదయం 8 నుంచి 8:10 వరకు) అధీకృత ఏజెంట్లు టికెట్లు బుక్ చేయకుండా నిబంధన విధించింది. రిజర్వేషన్ విండో ఓపెన్ అయినప్పుడు టికెట్లు బుక్ చేసే యూజర్లకు ఆధార్ వెరిఫికేషన్‌ను కూడా తప్పనిసరి చేసింది.




## రాహుల్ ద్రవిడ్ యజమానిలా వ్యవహరిస్తున్నారు.. విక్రమ్ రాథోడ్ ఆసక్తికర వ్యాఖ్యలు

భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ సాధారణంగా కోచ్‌గా కనిపిస్తారు. కానీ యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ (ఈటీపీఎల్)లో ఆయన కొత్త పాత్రలో కనిపిస్తున్నారు. డబ్లిన్ గార్డియన్స్ ఫ్రాంచైజీ యజమానిగా వ్యవహరిస్తున్నారు. అయితే జట్టు తొలి ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం కూడా సాధించలేదు. అయినా ద్రవిడ్ ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదని ఆ జట్టు కోచ్ విక్రమ్ రాథోడ్ తెలిపారు. టీమిండియా, ఐపీఎల్‌లో ద్రవిడ్‌తో కలిసి పనిచేసిన రాథోడ్‌కు ఆయన్ను యజమాని పాత్రలో చూడటం కొత్త అనుభవం. "రాహుల్ యజమానిలా వ్యవహరిస్తున్నారు. పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. తొలి దశలో మేం ఐదు మ్యాచ్‌లు ఆడినా ఒక్కటి కూడా గెలవలేదు. అయినా ఆయన పూర్తిగా మాకు మద్దతుగా నిలిచారు" అని రాథోడ్ చెప్పారు. కోచ్‌గా జట్లపై ఎలాంటి ఒత్తిడి ఉంటుందో ద్రవిడ్‌కు బాగా తెలుసని అన్నారు. ఫలితాలు అనుకున్నట్లు రాకపోయినా ఎలా స్పందించాలో ఆయనకు అవగాహన ఉందన్నారు. డబ్లిన్ గార్డియన్స్‌లో రవిచంద్రన్ అశ్విన్ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని రాథోడ్ వెల్లడించారు. ప్రత్యర్థులపై వ్యూహాలు, జట్టు ఎంపిక వంటి రోజువారీ క్రికెట్ వ్యవహారాలను ప్రధానంగా అశ్విన్ చూసుకుంటున్నారని తెలిపారు. అశ్విన్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆటగాళ్లపై అపారమైన అవగాహన ఉందని రాథోడ్ చెప్పారు. "అతడిని క్రికెట్ అభిమాని అని పిలుస్తాను. ప్రపంచవ్యాప్తంగా ఎంతమంది ఆటగాళ్లను, ఎన్ని మ్యాచ్‌లను గమనిస్తాడో ఆశ్చర్యంగా ఉంటుంది" అని పేర్కొన్నా రు. భారత క్రికెట్‌లోనే ఎక్కువ కాలం పనిచేసిన తనకు ఈటీపీఎల్ కొత్త అనుభవమని రాథోడ్ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అశ్విన్ జట్టులో ఉండటం ఎంతో ఉపయోగపడుతోంద న్నారు. స్థానిక పరిస్థితులు, ఆటగాళ్ల సామర్థ్యంపై అశ్విన్‌కు ఉన్న అవగాహన తన పనిని మరింత సులభం చేసిందని చెప్పారు.



## శాంసన్ వర్సెస్ వైభవ్.. ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా ఎవరుండాలంటే రహానే క్లారిటీ

టీ20ల్లో భారత్ ఓపెనర్ల విషయంలో తరచూ మార్పులు చేస్తోంది. శుభ్‌మన్ గిల్, సంజూ శాంసన్ మధ్య పోటీ నెలకొంది. అభిషేక్ శర్మ ఇప్పటికే తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. తర్వాత ఇషాన్ కిషన్ కూడా ఓపెనర్‌గా తన వాదన వినిపించాడు. అయితే అతడిని మూడో స్థానానికి పంపించారు. తాజాగా వైభవ్ సూర్యవంశీకి అవకాశం రావడంతో శాంసన్ మరోసారి జట్టులో చోటు కోల్పోయాడు. ఇంగ్లాండ్‌తో అరంగేట్ర సిరీస్‌లో వైభవ్ 14, 13, 15 పరుగులు చేశాడు. తర్వాత జింబాబ్వేతో సిరీస్‌లో మాత్రం అదరగొట్టాడు. మూడు మ్యాచ్‌ల్లో 151 పరుగులు చేశాడు. చివరి మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్ ఉత్తమ ఆటగాడి అవార్డును కూడా అందుకున్నాడు. ఇలాంటి సమయంలో భారత మాజీ బ్యాటర్ అజింక్య రహానే కీలక వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ కంటే సంజు శాంసన్‌కే మరో అవకాశం ఇవ్వాలని అభిప్రాయపడ్డాడు. వైభవ్‌కు భవిష్యత్తులో చాలా అవకాశాలు వస్తాయని చెప్పాడు. ప్రపంచకప్‌లో రాణించిన టాప్-3 బ్యాటర్లతోనే భారత్ ముందుకెళ్లాలని రహానే సూచించాడు. శాంసన్, అభిషేక్, ఇషాన్ కిషన్ టాప్-3లో ఉండాలని అన్నాడు. రెండు మూడు మ్యాచుల్లో విఫలమైనంత మాత్రాన శాంసన్‌ను పక్కన పెట్టడం సరికాదని చెప్పాడు. ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు శాంసన్‌ను తిరిగి జట్టులోకి తీసుకోవడంపై రహానే సంతోషం వ్యక్తం చేశాడు. ప్రపంచకప్‌లో శాంసన్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన విషయాన్ని గుర్తు చేశాడు. శాంసన్ మ్యాచ్ విన్నర్ అని పేర్కొన్నాడు. అతడి రాకతో జట్టు మరింత బలపడుతుందని చెప్పాడు.



# స్పోర్ట్స్

## టీమిండియాలో గాయాల బెడద.. కీలక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానించిన బీసీసీఐ



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మరో కీలక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లో 'హెడ్-స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్' పదవికి మళ్లీ దరఖాస్తులు కోరుతోంది. ఈ పోస్టును గతేడాది సెప్టెంబర్‌లోనూ భర్తీ చేసేందుకు ప్రయత్నించినా.. సరైన అభ్యర్థి దొరకకపోవడంతో ప్రక్రియ పూర్తికాలేదు. ఈ పదవి 2025 మార్చి తర్వాత ఖాళీగా ఉంది. దాదాపు మూడేళ్లు సీవోఈలో సేవలందించిన మాజీ టీమిండియా ఫిజియో నితిన్ పటేల్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ఈ ఖాళీ ఏర్పడింది. 2023 వన్డే ప్రపంచకప్ ముందు జస్‌ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, మహ్మద్ షమీల రికవరీలో పటేల్ కీలక పాత్ర పోషించారు. కొత్తగా ఎంపికయ్యే వ్యక్తి బీసీసీఐ స్పోర్ట్స్ సైన్స్, మెడిసిన్ విభాగానికి వ్యూహాత్మక, నిర్వహణపరమైన నాయకత్వం వహించాలి. జాతీయ జట్టు ఫిజియోలు, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ నిపుణులతో పాటు సీవోఈలోని వైద్య సిబ్బందిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆటగాళ్ల గాయాల నివారణ, చికిత్స, పునరావాసం, ఫిట్‌నెస్, శారీరక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. కొత్త వైద్య విధానాలు, పరిశోధనలు, సాంకేతికతను ఉపయోగించడం కూడా ఈ పోస్టులో కీలక బాధ్యతలుగా బీసీసీఐ పేర్కొంది. ఆటగాళ్ల ఆరోగ్యం, దీర్ఘకాలిక ఫిట్‌నెస్, గాయాల ముప్పు తగ్గించడం వంటి అంశాలపై వ్యూహాలను రూపొందించాల్సి ఉంటుంది. ఈ పోస్టుకు స్పోర్ట్స్ సైన్స్ లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ తప్పనిసరి. డాక్టరేట్ ఉంటే అదనపు అర్హతగా పరిగణిస్తారు. ప్రొఫెషనల్ లేదా ఒలింపిక్ క్రీడల్లో బృందాలకు నాయకత్వం వహించిన కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థి వయసు 60 ఏళ్లలోపు ఉండాలి.

## గ్లోబల్ స్టార్స్ కోసం వేట- సౌత్ కొరియా సంస్థతో జతకట్టిన రష్మిక

# యువతకు కీలక సందేశం!

స్టార్ హీరోయిన్ రష్మిక మందన యువతకు స్ఫూర్తినిచ్చే ఓ కొత్త కార్యక్రమంతో ముందుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కే-పాప్ గ్రూప్ బీటీఎస్ సహా ఎన్నో పాప్ గ్రూప్‌లను ప్రపంచానికి పరిచయం చేసిన దక్షిణ కొరియా వినోద సంస్థ 'హైబ్' . ఈ సంస్థ భారతదేశంలో 'హైబ్ ఇండియా' పేరుతో ప్రతిభావంతుల అన్వేషణకు ఆడిషన్స్ నిర్వహిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి రష్మిక మందన భాగస్వామిగా వ్యవహరి స్తున్నారు. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ.. తన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. "ప్రతి ప్రయాణం ఒక అవకాశంతో, ఆ మొదటి అడుగు వేయడానికి కావలసిన ధైర్యంతో మొదలవుతుంది. నా జర్నీని వెనక్కి తిరిగి చూసుకుంటే, మనపై మనం నమ్మకం ఉంచడం, కష్టపడి పనిచేయడం, ఊహించని అవకాశాలకు సరేననడం ఎంత ముఖ్యమో నాకు తెలుసు" అని ఆమె పేర్కొన్నారు. భారత్‌లో ఇలాంటి అవకాశం రావడం ఇదే మొదటిసారని రష్మిక అభిప్రాయపడ్డారు. "ప్రపం చవ్యాప్తంగా ఎందరో గొప్ప కళాకారులను తీర్చిదిద్దిన హైబ్ సంస్థ, ఇప్పుడు భారతీయ యువతలోని ప్రతిభను గుర్తించడానికి ముందుకు రావడం ఆనందంగా ఉంది. దేశంలో ఎంతోమంది అమ్మాయిలు కళాకారులుగా, పెర్ఫార్మర్‌లుగా ఎదగాలని కలలు కంటారు. వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుం టున్నాను. ప్రతి ఒక్కరూ తమ కలకు ఒక అవకాశం ఇవ్వాలి" అంటూ యువతలో ఆమె స్ఫూర్తి నింపారు. హైబ్ సంస్థ బీటీఎస్‌తో పాటు టీఎక్స్‌టీ , న్యూజీన్స్, ఇల్లిట్ వంటి ఎన్నో ప్రఖ్యాత కే-పాప్ గ్రూప్‌లను నిర్వహిస్తోంది. ఇక, సినిమాల విషయానికొస్తే.. రష్మిక ఇటీవల షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి 'కాక్‌టెయిల్ 2' చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'రణబాలి' అనే చిత్రంలో నటిస్తున్నారు. 1870ల కాలంలో దక్షిణ భారతదేశంలో తీవ్రమైన కరువు నెలకొన్న నేపథ్యంలో తన ప్రజలను, ప్రాంతాన్ని కాపాడుకోవడం కోసం ఓ తిరుగుబాటు యోధుడు బ్రిటిష్ కమిషనర్‌ను ఎలా ఎదుర్కొన్నాడు అనే కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది.





## తెలంగాణ బిడ్డగా పుట్టడం వల్ల నాకు వచ్చిన ప్రయోజం ఏమీ లేదు: ఉదయభాను

ప్రముఖ యాంకర్, నటి ఉదయభాను టాలీవుడ్ పరిశ్రమలో తన ప్రస్తుత పరిస్థితిపై భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. ఒక ప్రముఖ మీడియా ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే తనకు పరిశ్రమలో ఆఫర్లు తగ్గిపోయి, క్రమంగా అవకాశాలు లేకుండా పోయాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో తెలంగాణ నేపథ్యం ఉన్న కథలు, సినిమాలు ఎక్కువగా వస్తున్నా... కేవలం ప్రాంతీయ నేపథ్యం ఉన్నంత మాత్రాన అవకాశాలు వచ్చేయవని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడకముందే తాను బుల్లితెరపై అత్యధిక షోలు, ఎన్నో ఈవెంట్లు చేశానని ఉదయభాను గుర్తుచేశారు. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత స్థానిక నటిగా తనకు ఎలాంటి అడ్వాంటేజ్ లభించలేదని, చివరికి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా తనను హోస్ట్‌గా పిలవలేదని వాపోయారు. తెలంగాణ బిడ్డగా పుట్టడం వల్ల తనకు వచ్చిన ప్రయోజనం సున్నా అని ఆమె అభివర్ణించారు.



## ఇంటెన్స్ లవ్ స్టోరీ, పీరియడ్ ఫిలింస్ చేయాలని ఉంది

# రకుల్ ప్రీత్ సింగ్

-విభిన్న పాత్రలను ఎంచు కుంటూ దూసుకుపోతున్న రకుల్

-పీరియడ్ డ్రామాలు, హర్రర్ జోనర్‌లలో ఇప్పటి వరకు భాగం కాలేదన్న రకుల్

-పెద్ద బ్యానర్ కంటే మంచి పాత్రే తనకు ముఖ్యమని వెల్లడి

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు. ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.